## పీఏసీఎస్ చైర్మన్ కుటుంబానికి మండలి చైర్మన్ గుత్తా పరామర్శ


రాములమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ సిటీ, ఏప్రిల్18 :కనగల్ మండలంలోని లచ్చుగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి మాతృమూర్తి వంగాల రాములమ్మ ఈ నెల 16న మృతి చెందారు. విషయం తెలుసుకున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుక్రవారం లచ్చుగూడెం గ్రామానికి వెళ్లి రాములమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, మందడి మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

మునుగోడు మండలం పలివెలగ్రామంలో స్వాతంత్ర సమరయోధులు కొండవీటి బుచ్చిరెడ్డి, కొండవీటి జగన్మోహన్‌రెడ్డిల విగ్రహాలను మండలి చైర్మన్ ఆవిష్కరించారు.

## నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తాం

● ఎమ్మెల్యే వేముల వీరేశం


రుద్రాక్షి యాదయ్య, పుష్ప దంపతుల ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 18 : నిరుపేద కుటుంబాలకే మొదటగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తామని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం నకిరేకల్ మండలంలోని తాటికల్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన రుద్రాక్షి యాదయ్య-పుష్ప దంపతుల ఇంట్లో రేషన్ షాపుల ద్వారా అందించిన సన్నబియ్యంతో వండిన అన్నాన్ని ఎమ్మెల్యే తిన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనికులతో సమానంగా పేదలు సన్నబియ్యంతో కూడిన అన్నం తినాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ లింగాల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ కొండయ్య, నాయకులు ఉన్నారు.

## నేడు హాలియాలో అవగాహన సదస్సు

హాలియా, ఏప్రిల్ 18 : అనుముల మండలం కొత్తపల్లి రైతు వేదికలో శనివారం భూభారతి చట్టంపై మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తాసీల్దార్ రఘు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని రైతులు, రైతు ప్రతినిధులు సదస్సుకు హాజరై భూభారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలని కోరారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

● ఎమ్మెల్యే బాలూనాయక్

డిండి, ఏప్రిల్ 18 : రైతులు పండించిన పంటకు మద్దతు ధర అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దొడ్డురకం ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడంతో పాటు సన్నరకానికి రూ.500 బోనస్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ ఆంజనేయులు, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, ఏఓ రెహానా, డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ కార్యదర్శి బాల్‌రెడ్డి, ఏఈఓ మల్లేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముస్లింల నిరసన



మిర్యాలగూడలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

మిర్యాలగూడ, ఏప్రిల్ 18: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం పట్టణంలోని పలు మసీదుల వద్ద ముస్లిం మైనార్టీలు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక సీతారాంపురం,ఇస్లాంపుర, బంగారుగడ్డ, తాళ్లగడ్డ, గౌస్‌నగర్ మసీదుల వద్ద మసీదు కమిటీ ప్రతినిధులు, ఇమామ్‌లు, ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం తీసుకొచ్చి వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్ పెట్టుబడిదారులకు అప్పగించేందుకు యత్నిస్తుందన్నారు. వెంటనే చట్టాన్ని రద్దు చేసి వక్ఫ్ ఆస్తులను ముస్లింల సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు.



దేవరకొండలో శుక్రవారం నిర్వహించిన హర్ష టయోటా గ్రామీణ మహోత్సవ్ మెగా ఎక్స్చేంజ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, షోరూం సిబ్బంది

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

లింకు డాక్యుమెంట్ పోయినది
★గోన కమల్‌రూత్ దయానా W/o కోదమల జస్పర్ వరుణ్ R/o మారేడ్‌పల్లి, హైద్రాబాద్. నా యెక్క డాక్యుమెంట్స్‌కి లింకు డాక్యుమెంట్ (No.7063/2013) దేవరకొండ నుండి హైద్రాబాద్ కు RTC బస్సులో వెళుతుండగా పోయినది. దొరికిన వారు సంప్ర|| 8790169268
NLG

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | జనగామ : 9182777638

# వంగిన తూము షట్టరు

నారెళ్లగూడ మేజర్ నుంచి వృథాగా పోతున్న నీరు


నారెళ్ల గూడ మేజర్ ప్రధాన తూము నుంచి వస్తున్న నీరు


వ్యవసాయ భూముల్లోకి చేరిన నారెళ్లగూడ మేజర్ నీరు

నిడమనూరు, ఏప్రిల్ 18 : మండలంలోని నారెళ్లగూడ మేజర్ తూముకు ఉన్న షట్టర్ వంగిపోవడంతో మేజర్‌లోని నీరు వృథాగా పోతున్నాయి. మండు వేసవిలో నీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు అనుసంధానంగా వేంపాడు సమీపంలో ప్రారంభమయ్యే మేజర్‌లో గడిచిన నెల రోజులుగా నీరు ప్రవహిస్తూనే ఉంది. వారబందీ విధానం అమలు సమయంలోనూ నీటి విడుదల నిరంతరాయంగా సాగింది. నారెళ్ల గూడ మేజర్ ప్రధాన తూము షట్టర్ మరమ్మతుకు గురవడంతో మేజర్‌లో ఉన్న నీరంతా పొలాల్లోకి వృథాగా పోతున్నది.

**చాలా కాలంగా ఇదే తీరు**

నారెళ్ల గూడ మేజర్ ప్రధాన తూము షట్టరు కొద్ది నెలలుగా వంగిపోయి సరిగా మూసుకోవడం లేదు. అయినా ఈ విషయాన్ని సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో సాగు నీరు వృథాగా పోతున్నాయని రైతులు చెబుతున్నారు. మేజర్ పరిధిలో వరి కోతలు పూర్తవడంతో సాగు నీటి అవసరం కూడా పూర్తయింది. దాంతో ఈ నెల 11న నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. కానీ మేజర్‌లో ఉన్న నీరు తూము షట్టర్ ద్వారా వృథాగా పోతున్నది. ఎడమ ప్రధాన కాల్వకు నీటి విడుదలకు ముందు తూముల పరిస్థితిపై పర్యవేక్షణ చేపట్టాల్సిన అధికారులు ఆపనిని విస్మరించడంతో సాగునీరు వృథా అవుతున్నదని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా షట్టరుకు మరమ్మతు పనులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ప్రధాన కాల్వ ఏఈ అశోక్‌ను వివరణ కోరగా తూము షట్టరు గతంలో మరమ్మతుకు గురైందన్నారు. షట్టరు వంగిపోయినందున నీరు మేజర్‌లోకి వస్తుందని, కాల్వలో నీరు పూర్తి స్థాయిలో నిలిచిపోయిన తర్వాత తూము మరమ్మతు చేపడతామని పేర్కొన్నారు.

## పలు కుటుంబాలకు రాంచందర్‌నాయక్ పరామర్శ


రాగడప గ్రామంలో సాంబశివచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ట్రైకార్ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్

త్రిపురారం, ఏప్రిల్ 18: మండలంలోని డొంకతండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు హరిశ్చంద్ర మాతృమూర్తి చాప్లి శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ గ్రామానికి వెళ్లి చాప్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రాగడప గ్రామంలో ఇటీవల మృతి చెందిన దేవులపల్లి సాంబశివచారి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి అధ్యక్షుడు వెంకటాచారి, పీఏసీఎస్ చైర్మన్ జయరామ్ నాయక్, నాయకులు మడుపు వెంకటేశ్వర్లు, కలకొండ వెంకటేశ్వర్లు, భైరం కృష్ణ, ధనావత్ బిచ్చునాయక్ ఉన్నారు.

## గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి : సీడీపీఓ హరిత


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ హరిత

నీలగిరి, ఏప్రిల్ 18 : గర్భిణులు, బాలింతలు నాణ్యమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని నల్లగొండ సీడీపీఓ హరిత అన్నారు శుక్రవారం పట్టణంలోని హనుమాన్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ అభియాన్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లలు, కౌమార దశలో ఉన్న బాలికలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, దానిని అధిగమించేందుకు ప్రభుత్వం వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు కె.విజయలక్ష్మి, కరంటోత్ సుశీల, పుష్పమ్మ, సునంద, అనిత, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు


నల్లగొండ బస్టాండ్‌లో తనిఖీలు చేపడుతున్న డాగ్ స్క్వాడ్ బృందం

నీలగిరి, ఏప్రిల్ 18 : నిషేధిత మత్తు పదార్థాలు, చట్ట విరుద్ధమైన వస్తువులను గుర్తించేందుకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. బస్టాండ్, పలు లాడ్జీలు, దుకాణాలు, షాపింగ్ కాంపెక్స్‌లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా నల్లగొండ టూటౌన్ ఎస్ఐ వై.సైదులు మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. లాడ్జీల్లో బస చేసే వారు సరైన ధ్రువీకరణ పత్రాలు ఇస్తేనే అనుమతించాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

● డీఆర్‌డీఓ అశోక్‌రెడ్డి


ఐకేపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ అశోక్‌రెడ్డి

తిప్పర్తి, ఏప్రిల్ 18: ఐకేపీ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని డీఆర్‌డీఓ అశోక్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం పజ్జూరులోని ఐకేపీ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. తేమ, తాలు లేకుండా ఉన్న ధాన్యాన్ని వెంటనే కాంటా వేయాలని, ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు, గన్నీబ్యాగుల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం శ్రీదేవి, మాజీ సర్పంచ్ ఎస్‌కే మొయిజ్, నిర్వాహకులు ఉన్నారు.

## గుడిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మణిపాల్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 18 : గుడిపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ తేరా మణిపాల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రం చేసి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి ప్రభు త్వం అందించే మద్దతు ధరను పొందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, నాయకులు తేరా సత్యనారాయణరెడ్డి, వీరబోయిన ఎల్లయ్య, పాల్వాయి వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## వల్లాల అచ్చయ్య పరంధామ్‌కు బీపీ మండల్ పురస్కారం


అవార్డు అందుకుంటున్న పరంధామ్

రామగిరి, ఏప్రిల్ 18: నల్లగొండ పట్టణానికి చెందిన కవి, లింగమంతుల అధ్యయన పీఠం కన్వీనర్ వల్లాల అచ్చయ్య పరంధామ్‌కు యాదవ రాజ్యాధికార సాధన సమితి బీపీ మండల్ పురస్కారం అందించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు బీసీ సంఘాల నాయకులు సూరాజ్ మండల్, ఆర్.కృష్ణయ్య, బడుగుల నాగార్జు అవార్డు అందించారు. అవార్డు అందుకున్న అచ్చయ్యను సాహితీవేత్తలు సాగర్ల సత్తయ్య, బెల్లియాదయ్య, ఆనంద్ అభినందించారు.

## నేడు జిల్లా కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 18 : జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లను తాకుతున్న చెట్లకు తొలగించేందుకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని దారుషఫాకాలనీ, మిర్యాలగూడరోడ్డు, భారత్‌గ్యాస్ గోడౌన్, మహిళా ప్రాంగణం, అల్కాపురికాలనీ, షమ్సీనగర్, సాయి విశ్వనాథకాలనీ, బృందావన్‌కాలనీ, హైటెక్‌కాలనీ, ప్రకాశంబజారు, రహమత్‌నగర్, ఎస్ఆర్ గార్డెన్, అన్సారీకాలనీ, మాన్యంచెల్క, క్రాంతినగర్, పద్మావతి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

**మిర్యాలగూడలో..**

మిర్యాలగూడ : పట్టణంలోని ఈదులగూడ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ శ్రీనగర్ కాలనీ ఫీడర్ లైన్ పనులు జరుగుతున్నందున శనివారం శ్రీనగర్‌కాలనీ, హౌసింగ్‌బోర్డు, రంగన్నకాలనీతోపాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో వన్‌టౌన్ ఏఈ పి.మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## దామరచర్ల ఎంపీడీఓగా అలివేలు మంగ

దామరచర్ల, ఏప్రిల్ 18: దామరచర్ల ఎంపీడీఓగా అలివేలు మంగ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. త్రిపురారం ఎంపీడీఓగా పని చేసిన ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, ఏపీఓ నాగేశ్వరరావు, ఏపీఎం దిలీప్‌కుమార్, ఎంపీఓ శ్రీకాంత్‌రెడ్డి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్థిక సాయం

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 18: మండలంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన వలవాయి అంజయ్య తల్లి నరసమ్మ శుక్రవారం మృతిచెందారు. సామాజికవేత్త పగడాల సైదులు నరసమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట చింతమల్ల శ్రీనివాస్, వలవాయి శివ, గుంజ శివ, కృష్ణయ్య ఉన్నారు.

**హమాలీ కుటుంబానికి..**

శాలిగౌరారం: మండలంలోని బాలిశెట్టిగూడెం గ్రామానికి చెందిన హమాలీ బట్ట సతీశ్ ఇటీవల వడదెబ్బతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్వై మండలాధ్యక్షుడు కల్లూరి నాగరాజుగౌడ్ శుక్రవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

## మనిమద్దెలో చలివేంద్రం

శాలిగౌరారం, ఏప్రిల్ 18 : మండలంలోని మనిమద్దె గ్రామంలో ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

కేతేపల్లి, ఏప్రిల్ 18 : క్రిమి సంహారక మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శివతేజ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన భీమనపల్లి కొండయ్య(32) ఈ నెల 16న బైక్ విషయంలో తన తండ్రి వెంకయ్యతో గొడవ పడ్డాడు. దాంతో తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొండయ్యను సూర్యాపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పాల్వాయి స్రవంతి

## మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసిన పాల్వాయి స్రవంతి

మునుగోడు, ఏప్రిల్18 : మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన జన్మదినం సందర్భంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల నాయకులు మారగోని అంజయ్యగౌడ్, మేకల శ్రీనివాస్‌రెడ్డి, పొలగోని సైదులుగౌడ్, గుర్రాల సురేశ్, పాల్వాయి వెంకట్‌రెడ్డి, గజ్జల బాలరాజ్‌గౌడ్, గురిజ సునీల్‌గౌడ్, మారగోని ఉదయకుమార్‌గౌడ్, మురళి, దోటి సాయి, నాగరాజు ఉన్నారు.

## వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి

● సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

రామగిరి, ఏప్రిల్ 18: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టంతో మైనార్టీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని, వెంటనే చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన పార్టీ జిల్లా సమితి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, ఉద్యమకారులు, అన్ని వర్గాల ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంపన్న వర్గాలకు దేశ సంపదను కట్టబెట్టడమే కాకుండా వారికి అనుకూలమైన చట్టాలను తీసుకువచ్చి పేద ప్రజలపై ధరల, పన్నుల భారం మోపుతుందని విమర్శించారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు బొడ్డుపల్లి వెంకటరమణ, పల్లా నరసింహారెడ్డి, మల్లేపల్లి ఆదిరెడ్డి, పల్లె నరసింహ, పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, అంజయ్యచారి, నలపరాజు రామలింగయ్య పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

● టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నల్లగొండ అంజి


సమావేశంలో పాల్గొన్న టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నల్లగొండ అంజి, బీఆర్ఎస్వీ నాయకులు

రామగిరి, ఏప్రిల్ 18: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని తెలంగాణ స్టూడెంట్ యూనియన్(టీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు నల్లగొండ అంజి కోరారు. శుక్రవారం నల్లగొండలోని ఎన్జీ కళాశాలతో విద్యార్థి నాయకులతో కలిసి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఏఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సారథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు వడ్డెపల్లి సందీప్, కత్తుల జయచందన్, వెంపటి శ్రీకాంత్, కృష్ణ, క్రాంతికుమార్, సునీల్, రాంబాబు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

● చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు


ఏసును శిలువ వేసిన ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న క్రైస్తవులు

రామగిరి, ఏప్రిల్ 18: క్రైస్తవులు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసు క్రీస్తు శిలువ వేయబడిన రోజును స్మరించుకుంటూ ఆ సన్నివేశాన్ని ప్రదర్శించారు. జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో గల మరియరాణి గుట్టపైగల చర్చిలో ఏసుక్రీస్తును శిలువ వేసిన సన్నివేశాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా శిలువ ప్రదర్శనను చేపట్టగా క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, గుమ్మల మోహన్‌రెడ్డి, శౌరయ్య, డాక్టర్ ఏసీహెచ్ పుల్లారావు, క్రైస్తవ మతపెద్దలు పాల్గొన్నారు.

## ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన


నల్లజెండాతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రామగిరి, ఏప్రిల్ 18: తాళ్లరాంపూర్‌లో గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలని, గౌడ మహిళాలను గుడి నుంచి గెంటివేసి, ఈత చెట్టను తగులబెట్టిన వీడీసీ సభ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నల్లగొండలోని సుభాశ్‌విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నల్లజెండాతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీల జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్, కల్లు గీత కార్మక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, సీపీఎం నాయకులు దండెంపల్లి సత్తయ్య, మల్లం మహేశ్, కొండ అనూరాధ, ఎండీ సలీం, మన్నెం భిక్షం, అద్దంకి నర్సింహ పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి : టీయూఎఫ్


టీయూఎఫ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దవూర, ఏప్రిల్ 18: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడు తెలంగాణ సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో టీయూఎఫ్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుల, అమరవీరుల ఆశయ సాధనకు ఫోరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రమావత్ నగేశ్, కుక్కమూడి ముత్యాలు, దుబ్బ రమేశ్, రమావత్ రవికుమార్, తరి రామకృష్ణ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో కొర్రీలు

● బొప్పారం ఐకేపీ కేంద్రంలో రైతుల నిరసన

కేతేపల్లి, ఏప్రిల్ 18 : మండలంలోని బొప్పారం గ్రామంలో ఉన్న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యంలో గింజ పరిమాణంలో తేడా ఉందంటూ నిర్వాహకులు కొర్రీలు పెడుతున్నారు. ధాన్యం గింజ పరిమాణంలో తేడా ఉందని పేర్కొంటూ ఏ గ్రేడ్‌కు ఇచ్చే రూ.2320 కాకుండా సాధారణ మద్దతు ధర రూ.2300 ఇస్తామని నిర్వాహకులు చెబుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. దాంతో తాము క్వింటాకు రూ.20 నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతులు నిరసన వ్యక్తం చేశారు.